www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శని వారం, 17 డిసెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ వృద్విరాజు | సంపుటి - 07, సంచిక-212 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# జాతీయ రాజకీయాల్లోకి బిఆర్ఎస్ ప్రవేశం

## ఢిల్లీలో సిఎం కెసిఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన నేతలు




**న్యూఢిల్లీ, డిసెంబర్ 16 (సమసమాజం):** ఢిల్లీలో బీఆర్ఎస్ పార్టీ జాతీయ కార్యాలయాన్ని ప్రారంభించడంపై సీఎం కేసీఆర్‌కు అభినందనలు వెల్లువెతుతున్నాయి. పలువురు నాయకులు,ప్రముఖులు కలసి అభినందిస్తున్నారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యే హన్మంత్ షిండె, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మాచారెడ్డి ఎంపీపీ నర్సింగరావు తదితరులు ఢిల్లీలో సీఎం కేసీఆర్‌ను కలిసి అభినందనలు తెలియజేసారు. అలాగే మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ జాతీయ కార్యదర్శి ప్రజ్ఞా తదితరులు ఢిల్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పుష్పగుచ్ఛ అందించి శుభాకాంక్షలు తెలియజేసారు. అలాగే ఎమ్మెల్యే జోగు రామన్న, మాజీ ఎంపీ నగేశ్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు పుటం పురుషోత్తం ఢిల్లీలో సీఎం కేసీఆర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన వారిలో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, మాణిక్‌రావులు కూడా ఉన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, బీఆర్ఎస్ నేతలు బూడిద భిక్షమయ్యగౌడ్, పల్లె రవికుమార్ తదితరులు అభినందనలు తెలిపారు. ఢిల్లీలో సీఎం కేసీఆర్‌ను కలిసిన తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ అల్లం నారాయణ, టీయూడబ్ల్యూజే నేత ఆస్కాని

3లో

# ప్రధాని మోడీతో ఎంపి కోమటిరెడ్డి భేటీ

మూసీ ప్రక్షాళన, విజయవాడ హైవేపై చర్చ

రాజకీయాల గురించి మాట్లాడలేదని వ్యాఖ్య



**న్యూఢిల్లీ, డిసెంబర్ 16 (సమసమాజం):** భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంతో పాటు తెలంగాణ ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రధాని నరేంద్రమోడీతో చర్చించినట్లు కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు. ప్రధానితో దాదాపు 20 నిమిషాల పాటు వివిధ అంశాలపై చర్చించానని, అడగ్గానే అపాయింట్ మెంట్ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. మోడీతో భేటీలో మూసీ నది కాలుష్యంపై చర్చించాననిస నమామి గంగా నది పథకం కింద మూసీ ప్రక్షాళన చేపట్టాలని కోరినట్లు వెంకట్ రెడ్డి చెప్పారు. గుజరాత్ లోని సబర్మతి నదిలా మూసీ రూపురేఖలు

3లో

## కోమటిరెడ్డి ప్రధానితో భేటీపై ఎంపి అర్వింద్ ట్వీట్

కోమటిరెడ్డి కాషా కండువా కప్పుకుంటారా

ట్రోల్ చేస్తున్న నెటిజన్లు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 16 (సమసమాజం):** మోదీ–కోమటిరెడ్డి వెంకటరెడ్డి భేటీపై నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ట్విట్టర్‌లో స్పందించారు. మూసీ నది ప్రక్షాళన, నమామి గంగా తరహాలో మూసీ నదిని శుద్ధి చేయాలని ప్రధాని మోదీని వెంకటరెడ్డి కోరనున్నారంటూ ధర్మపురి అర్వింద్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. దేశంలో, రాష్ట్రంలో

3లో

## ప్రభుత్వాసుపత్రిలో కాన్పు చేసుకున్న జడ్జి

అభినందించిన మంత్రి ఎర్రబెల్లి




**హన్మకొండ, డిసెంబర్ 16 (సమసమాజం):** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ న్యాయస్థానంలో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి శాలిని హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ తో కలిసి జడ్జి షాలినినీ ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ

3లో

## వందరోజులు పూర్తి చేసుకున్న జోడోయాత్ర

రాజస్థాన్‌లో కొనసాగుతున్న రాహుల్ యాత్ర



**జైపూర్, డిసెంబర్ 16 (సమసమాజం):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర శుక్రవారం వంద రోజుల మైలురాయి చేరుకుంది. రాహుల్ దాదాపు 2,600 కిలోమీటర్లు నడిచిన తర్వాత, ఈ యాత్ర 100 రోజులు పూర్తి చేసుకుంది. రాహుల్ గాంధీ, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాజస్థాన్‌లోని మీనా హైకోర్టు దౌసా నుంచి వందో రోజైన శుక్రవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో యాత్రను పునఃప్రారంభించారు. భారత్ జోడో యాత్ర 100 రోజుల మార్కు చేరుకున్న సందర్భాన్ని

3లో

# విషాదంగా ముగిసిన పాప మిస్సింగ్





చెరువులో శవమై తేలిన చిన్నారి ఇందు

స్కూల్ నుంచి ఆడుకోవడానికని వెళ్లినట్లు గుర్తింపు

బాలిక శవాన్ని గాంధీకి తరలించిన పోలీసులు

కన్నీరు మున్నీరైన తల్లిదండ్రులు

**మేడ్చల్, డిసెంబర్ 16 (సమసమాజం):** మరో దారుణం జరిగిపోయింది. ఓ కుటుంబంలో తీరని విషాదం నింపింది. గురువారం అదృశ్యమైన బాలిక చెరువులో శవయమై తేలింది. కనిపించకపోయే సరికి ఆశగా చూస్తున్న తల్లిదండ్రులకు తీరని గర్భశోకాన్ని మిగిల్చింది. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో అదృశ్యమైన 10 ఏళ్ల చిన్నారి కథ విషాదాంతమైంది. దమ్మాయిగూడ చెరువులో బాలిక ఇందు మృతదేహం లభ్యమైంది. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా బాలిక చెరువు వైపు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. దాని ఆధారంగా చెరువు వద్దకు వెళ్లగా

3లో

## 26నుంచి రాష్ట్రపతి ముర్ము నగరంలో విడిది

### అధికారులతో సమీక్షించిన సిఎస్ సోమేశ్

**హైదరాబాద్, డిసెంబర్ 16 (సమసమాజం):** దక్షిణాది పర్యటనలో భాగంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలంగాణలో ఐదురోజుల పాటు విడిది చేయనున్నారు. ఈ మేరకు తఅధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు రాష్ట్రంలోని రామప్ప, భద్రాచలంతో పాటు హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొననున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్



3లో

# ఆర్మీ హౌజ్‌లో ఘనంగా విజయ్ దివస్

యుద్ధవీరులను స్మరించుకున్న రాష్ట్రపతి, ప్రధాని ● రక్షణమంత్రి రాజ్‌నాథ్ సమక్షంలో విజయోత్సవాలు





**న్యూఢిల్లీ, డిసెంబర్ 16 (సమసమాజం):** ఢిల్లీలోని ఆర్మీ హౌస్‌లో విజయ్ దివస్ 2022 వేడుకలు ఘనంగా జరిగాయి. 1971 బంగ్లాదేశ్ విముక్తి కోసం జరిగిన యుద్ధంలో పాకిస్తాన్‌పై భారత్ సాధించిన విజయాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్మ, ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు ఘనంగా జరుపుకున్నారు. రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ పర్యవేక్షణలో జరిగిన విజయ్ దివస్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సైనికాధికారులు పాల్గొన్నారు. పాక్ పై దేశం సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ ప్రతీ ఏడాది డిసెంబర్ 16న విజయ్ దివస్ పేరుతో విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తారు. విజయ్ దివస్ సందర్భంగా ఆర్మీహౌస్ ఆవరణలో ప్రత్యేక వీడియోను ప్రదర్శించారు. పాక్ పై భారత్ సాధించిన విజయాన్ని వీడియో ప్రదర్శన ద్వారా వివరించారు. సరిగ్గా 51 ఏళ్ల క్రితం పాకిస్తాన్ సైన్యం నుండి 93వేల మంది సైనికులు తమ ఆయుధాలను భారత్ కు లొంగిపోయారు. ఫలితంగా పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయి స్వతంత్ర దేశంగా అవతరించింది. 1971 డిసెంబర్ 16న లెఫ్టినెంట్ జనరల్ అమీర్ అబ్దుల్లా ఖాన్ నియాజీ, తూర్పు పాకిస్తాన్ చీఫ్ మార్షల్ లా అడ్మినిస్ట్రేటర్ ,తూర్పు పాకిస్తాన్‌లో ఉన్న పాకిస్తాన్ ఆర్మీ కమాండర్ ఈ లొంగుబాటు సాధనంపై సంతకం చేశారు. ఈ సన్నివేశాలన్నీ ఆర్మీ హౌస్ లో ప్రదర్శన చేశారు.

## హిమాచల్‌లో గెలిపించుకోలేని నేత నడ్డా

తిట్ల పురాణంతో ఓట్లు రాలవని గుర్తించాలి

మునుగోడుకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి

దేశ ఆర్థిక పరిస్థితి ఎందుకు దిగజారింది

దేశంలో విపరీతంగా ఎందుకు అప్పులు చేశారు

తెలంగాణకు ఇవ్వాల్సిన ఆర్థిక సాయం ఎందుకు ఆపారు

కరీంనగర్ సభలో నడ్డా వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన హరీష్ రావు



**హైదరాబాద్, డిసెంబర్ 16 (సమసమాజం):** బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తన సొంత రాష్ట్రం హిమాచల్ ప్రదేశ్‌నే నిలుపుకోలేకపోయారని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడ బీజేపీ ఓడిపోయిందని గుర్తు చేశారు. కరీంనగర్ బహిరంగ సభలో జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలను విలేకరుల సమావేశంలో హరీశ్ రావు ఖండించారు. తెలంగాణ ప్రభుత్వంపై నడ్డా చేసిన

3లో

# సంపాదకీయం

## బలమైన ప్రతిపక్షం నిర్మాణం తక్షణావసరం !

జాతీయస్థాయిలో బీజేపీకి విశ్వసనీయమైన లౌకికవాద, ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయ వేదికను అందించడం లో ప్రతిపక్షాలు విఫలమయ్యాయి. బీజేపీకి ప్రధాన ప్రత్యర్థి స్థానాన్ని కాంగ్రెస్ కోల్పోయింది. ప్రతిపక్షాల్లో అనైక్యత కూడా బిజెపి తనకు అనుకూలంగా మలచుకుంటోంది. ఈ క్రమంలో తెలంగాణ సిఎం కెసిఆర్ చేపట్టిన విపక్షపాత్రకు నిజానికి ప్రతిపక్ష పార్టీలన్నీ కలసి రావాలి. గతంలో ఇందిరకు వ్యతిరేకంగా ఎమర్జెన్సీ ని నిరసిస్తూ జయప్రకాశ్ నారాయణ్ ఇచ్చిన పిలుపుతో ఆనాడు విపక్షాలన్నీ ఏకమయ్యాయి. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితులే ఉన్నాయి. కాకపోతే ఎమర్జెన్సీ మాత్రమే లేదు. అయితే అప్రకటిత ఎమర్జెన్సీ, అప్రకటిత నియంతృత్వం కొనసాగిస్తున్న మోడీ పాలనను నిలదీసే గట్టి ప్రతిపక్షం అవసరం. ప్రజాస్వామ్యం లో గట్టి ప్రతిపక్షమే ప్రాణం. ఈ పాత్రపోషించేందుకు బయలుదేరిన కెసిఆర్‌ను బలపరచడానికి విపక్షాలు కూడా ముందుకు రావడం లేదంటే వారికి దేశంపట్ల చిత్తశుద్ది లేదని అర్థం చేసుకోవాలి. లేదా అవినీతిలో కూరుకు పోయారని భావించాలి. నిజానికి గొంతెత్తిన ఈ అవకాశాలన్నిటిని విపక్షాలు ఉపయోగించుకోవాలి. దక్షిణాది నుంచి బయలు దేరిన ఏకైక నేతగా ఇప్పుడు కెసిఆర్ ముందు వరసలో ఉన్నారు. ఆయనకు తోడ్పాటును అందిస్తే బలమైన ప్రతిపక్షం ముందు ఏర్పడే అవకాశం ఉంది. ఇకపోతే బిజెపితో పోటీ పడుతున్న ఆప్ కూడా ఇదేరకమైన ఆలోచనచేయాలి. విపక్షాలు కలసి పోరాడాలన్న సంకల్పం తీసుకుంటేే తప్ప భారత ప్రజాస్వామ్యం సక్రమమైన పద్దతిలో సాగదు. ఇప్పటికైనా లోపాలను సరిదిద్దుకోకపోతే కాంగ్రెస్‌కు భవిష్యత్తు కష్టమే. ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా కలసి పోరాడితే తప్ప, మోదీనీ, బీజేపీనీ 2024లో నైనా సరే ఎదుర్కోవడం అంత సులభం కాదని కూడా గుర్తిస్తే మంచిది. పంజాబ్, గుజరాత్, హిమచాల్‌లో అలాంటి అవకాశం వచ్చినా విపక్షాలు కాలదన్నాయి. అందుకే గుజరాత్‌లో బిజెపి భారీ విజయం సాధించగలిగింది. ఎవరికి వారు పోటీ చేసి తమ అధికార కాంక్షను చాటుకున్నాయి. ఇదే బిజెపికి కలసి వచ్చిందని మరోమారు గుర్తించాలి. మొత్తంగా బీజేపీ, మోదీ ప్రభంజనానికి తిరుగులేదనే భావనను ఈ ఎన్నికల ఫలితాలు కలిగించాయి. బూత్ స్థాయి వరకు పాతుకుపోయిన బలమైన యంత్రాంగం, ఎనిమిదేళ్ళ పైచిలుకు పాలనానుభవం, పార్టీ విస్తరణ కాంక్ష బీజేపీకి ఇప్పుడు పెట్టని కోటలుగా నిలిచాయి. విభిన్న సమీకరణాల ఎన్నికల రాజకీయాల నిర్వహణలో ప్రస్తుతం దేశంలో మరే పార్టీ దానికి సాటిరావని మరో మారు నిరూపించుకున్నారు. అభివృద్ధి, సంక్షేమాల కార్డుతో కేజ్రీవాల్ పంజాబ్ కోటపై జెండా పాతారు. కాంగ్రెస్, బీజేపీ తర్వాత దేశంలో ఒకటికి రెండుచోట్ల అధికారంలో ఉన్న పార్టీ అనే ఘనతను 'ఆప్'కు దక్కింది. సంక్లిష్ట కుల, ప్రాంత సమీకరణలతో బహుముఖ పోటీ ఉండే భారత్‌లో ప్రజలను ఏకతాటిపైకి తీసుకుని రావాల్సి ఉంది. ఒకప్పుడు యూపీ రాజకీయాలను శాసించిన బీఎస్పీ నామామాత్రంగా మారి పోవడం మరో విషాదం. దళితులు, బిసిల్లో ఆ పార్టీ పూర్తిగా పట్టు కోల్పోయింది. కోవిడ్ నిర్వహణలో వైఫల్యం, ధరల పెరుగుదల, ఉపాధి లేమి, రైతు ఉద్యమాలు, మధ్యతరగతి కష్టాలు, అధికారపక్షానికి సాధారణంగా ఎదురయ్యే వ్యతిరేకత లాంటివేవీ బీజేపీ విజయాలను ఆపలేకపోతున్నాయి. మొన్నటి గుజరాత్ ఫలితాలు మోదీ పాపులారిటీని, దేశవ్యాప్తంగా మానసిక సానుకూలతను కచ్చితంగా పెంచాయి. ఇవన్నీ కూడా విపక్షాల అనైక్యతను స్పష్టం చేస్తున్నాయి. హిమాచాల్‌లో పట్టు కోల్పోయినా, గుజరాత్‌లో అధికారం నిలుపుకోవడంతో బిజెపి నేతలు తదుపరి అధికారం తెలంగాణలోనే అని రంకెలు వేస్తున్నారు. ఎపిలోనూ పాగా వేస్తామని అంటున్నారు. తాడూ బొంగరం లేని చోట ఆట ఎలా ఆడుతారో బిజెపిని చూసి నేర్చుకోవాలేమో. ఎందుకంటే ఎపి విషయంలో బిజెపి తీరు దారుణంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ చేసిన

నిర్వాకాలను ఎండగడుతూ వచ్చిన బీజేపీ కూడా తాము అధికారంలో లేని రాష్ట్రాల విషయంలో నిర్లక్ష్యం గా వ్యవహరిస్తోంది. 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన అనంతరం... విభజిత ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయాన్ని పట్టించుకోవడం లేదు. తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు మేలు చేయక పోగా, పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లో పేర్కొన్న రెవెన్యూలోటు భర్తీ, వెనుకబడిన 7 జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖకు రైల్వేజోన్ తదితర కీలకమైన అంశాలను; పార్లమెంట్ సాక్షిగా ఇస్తామని వాగ్దానం చేసిన రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశాన్ని పక్కన పెట్టేసింది. కేంద్రంలో సుదీర్ఘ కాలం అధికారంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాలను చిన్నచూపు చూసేది. రాజకీయ ఫిరాయింపులను ప్రోత్సహించేది. దీంతో దానికి వ్యతిరేకంగా దేశంలో అనేక ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయి. ప్రాంతీయ అస్తిత్వం, ఆత్మగౌరవం, రాష్ట్రాల హక్కుల పరిరక్షణ అనే అంశాల ఆధారం గానే అవి ప్రజల విశ్వాసాన్ని చూరగొని అధికారంలోకి రాగలిగాయి. ఇప్పుడు బిజెపి కూడా అదే పద్దతిలో రాష్ట్రాలను చూస్తోంది. విభజన హామీలను నెరవేర్చే విషయంలో ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణకూ న్యాయం జరగడంలేదు. ఇందుకు కూడా రాజకీయాలే కారణం. విభజన బిల్లులో పేర్కొన్న ప్రకారం తెలంగాణకు ఇవ్వాల్సిన కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, ములుగులో గిరిజన యూనివర్సిటీ, కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా; నీతి ఆయోగ్ సిఫార్సు మేరకు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయలకు రూ. 24,000 కోట్ల ఆర్థిక సాయం వంటివి అనేకం పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకునే మోదీ ప్రభుత్వంపై కేసీఆర్ దాడికి దిగారు. ఇదే సమయంలో రాష్ట్రాలు బలోపేతం అయితేనే దేశం ఆర్థికంగా పటిష్ట మవుతుందని కేంద్రం గ్రహించడం లేదు. రాష్ట్రాలను బలహీన పర్చడం వలన సాధించేదేమీ ఉండదని ప్రధాని నరేంద్ర మోదీ గ్రహించడం లేదు. ఇది ఓరకంగా ప్రజలను విస్మరించడమే అని బిజెపి కూడా గుర్తించడం లేదు. రాజ్యాంగ బద్ధంగా లభించాల్సిన నిధులు, హక్కులు బదలాయించి సమాఖ్య స్ఫూర్తిని చాటుతామన్న తొలినాళ్ల హామీలను మోడీ విస్మరించారు. ఇలాంటి రాజకీయ పరిస్థితులు దాదాపుగా బిజెపియేతర రాష్ట్రాల్లో ఉన్నాయి. అందువల్ల అన్ని పార్టీల నేతలు ఇగోలను పక్కన పెట్టి ఉమ్మడి అజెండగా ముందుకు సాగాలి. అప్పుడే మోడీకి ప్రత్యామ్నాయం సృష్టించగలరు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి దోహదపడగలదు.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# దివ్యాంగులకు స్వయం ఉపాధిలో శిక్షణ



## సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

**పెద్దపల్లి, డిసెంబర్ 16 (సమసమాజం):** దివ్యాంగులకు స్వయం ఉపాధిలో శిక్షణ ఇచ్చి వారి ఆర్థిక ఎదుగుదలకు రుణాలను అందజేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం ధర్మారం మండల కేంద్రంలో ఎనేబుల్ ఇండియా స్వచ్ఛంద సేవ సంస్థ సహకారంతో క్యాడర్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'దివ్యాంగుల గర్వ సే' సెంటర్ ను మంత్రి కొప్పుల ప్రారంభించారు. 18 సంవత్సరాల నిండి 45 సంవత్సరాల లోపు గల దివ్యాంగులను స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల పర్యవేక్షణలో గుర్తిస్తామని అన్నారు. వారికి గ్రామీణాభివృద్ధి స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా శిక్షణ కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం దివ్యాంగులకు ప్రభుత్వ సంస్థల ద్వారా ఆర్థిక రుణాలను అందజేస్తామ న్నారు. అంతకుముందు మండలం కేంద్రంలో సైడ్ డ్రైనేజీ నిర్మాణాన్ని పరిశీలించి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం గొల్లపెల్లి మండలంలోని మల్లన్నపేట గ్రామంలో జరుగుతున్న శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాల్లో మంత్రి సతీ సమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండి అన్నదాత ఇంట సిరుల పంట కురవాలని పూజలు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక పూజల తరువాత నిలువెత్తు బంగారం (బెల్లం) మొక్కును చెల్లించుకున్నారు.

# రైతు ఆత్మహత్యపై పట్టింపు ఏదీ



## రైతులకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే ఎలా

## సిబిఐ కేసులతోనే కవిత జాగృతి డ్రామాలు

## ఘాటు వ్యాఖ్యలు చేసిన కొండా సురేఖ

**హన్మకొండ, డిసెంబర్ 16 (సమసమాజం):** తెలంగాణలో రైతులు ఆత్మహత్య చేసుకుంటే పట్టించుకోని కేసీఆర్.. దేశ రైతులను ఉద్దరించడానికి పోతా అంటున్నారంటూ .మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకురాలు కొండా సురేఖ విమర్శించారు. తల్లికి మట్టి గాజులు తేలేనోడు.. చిన్నమ్మకు బంగారు గాజులు తెస్తా అన్న

తరహాలో కేసీఆర్ తీరు ఉందన్నారు. తెలంగాణలో రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చి, ఆ తర్వాత దేశంలో తిరుగుతావో లేక హిందూ మహాసముద్రంలో దూకుతావో నిర్ణయించుకో కేసీఆర్ అంటూ కొండా సురేఖ విమర్శలు గుప్పించారు. ఇతర రాష్ట్రాల్లో కేసీఆర్ మీటింగ్‌లు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ ఇప్పటివరకు రైతులకు ఏమీ చేయలేదని, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ క్రమంలో కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్సీ కవితను కేసీఆర్ సీఎం చేస్తారేమో అన్న అనుమానం తనకు కలుగుతుందని వ్యాఖ్యానించారు. కవితను సిఎం చేయడం ద్వారా కేసుల తీవ్రతను తగ్గించాలన్న ఆలోచన కూడా ఉండివుంటుందని అన్నారు. అలాగే కేటీఆర్ ఢిల్లీలో బీఆర్ఎస్ కార్యాలయ ప్రారంభోత్సవానికి వెళ్లలేదని, కేటీఆర్, కవితల మధ్య సఖ్యత సరిగ్గా లేదని కొండా సురేఖ ఆరోపించారు. కేటీఆర్ బీఆర్ఎస్ కార్యాయలం ప్రారంభోత్సవానికి వెళ్లకపోవడం వెనుక తనకు అనేక అనుమానాలు కలుగుతున్నాయని కొండా సురేఖ తెలిపారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో సీబీఐ నోటీసులతో కవిత అభద్రతాభావంతో ఉన్నారని, అందుకే కేసీఆర్ వెంట తిరుగుతున్నారని కొండా సురేఖ విమర్శించారు. లిక్కర్ దందాలలో కవిత, గ్రానైట్ దందా, భూకబ్జా లలో కేటీఆర్ బిజీగా ఉన్నారని ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవితను అరెస్ట్ చేస్తారనే భయంతో కేసీఆర్ ఎలాంటి నిర్ణయాలైనా తీసుకోవచ్చంటూ కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత కవిత ఒక్కసారి కూడా జాగృతిని పట్టించుకోలేదని, ఇప్పుడు సీబీఐ భయంతో జాగృతిని ముందుకు తెస్తున్నారని కొండా సురేఖ విమర్శించారు. కేవలం అరెస్ట్ భయంతో కవిత జాగృతి పేరుతో డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని, జాగృతి పేరుతో రూ.కోట్ల వసూలు చేశారని ఆరోపించారు. దేశాన్ని దోచుకోవడానికి కేసీఆర్ బీఆర్ఎస్ పెట్టారని, కేసీఆర్ ఫ్యామిలీ కలిసి రాష్ట్రాన్ని, దేశాన్ని దోచుకోవడానికి రెడీ అయ్యారని కొండా సురేఖ విమర్శించారు. కవితను సీఎం చేస్తారేమోనని, కేటీఆర్ ఢిల్లీ వెళ్లకపోవడంపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతోన్నాయి. అయితే వేరే పర్యటన వల్ల కేటీఆర్ ఢిల్లీ టూర్‌ను చివరి నిమిషంలో రద్దు చేసుకున్నారు. ఈ మేరకు కేసీఆర్‌కు సమాచారం ఇచ్చారని, కేసీఆర్ అనుమతితోనే కేటీఆర్ ఢిల్లీకి రాలేదని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. కేటీఆర్ పర్యటనపై రాద్ధాంతాలు చేయడం సరికాదని చెబుతున్నారు. కేసీఆర్ తర్వాత కేటీఆరే సీఎం అని అందరూ భావిస్తున్న తరుణంలో కొండా సురేఖ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.

# రకుల్, పైలెట్ రోహిత్ రెడ్డిలకు ఇడి సమన్లు





## 19న విచారణకు రావాలని ఆదేశాలు

## డ్రగ్స్ కేసులో విచారణ కోసమే అంటూ ప్రచారం

**హైదరాబాద్, డిసెంబర్ 16 (సమసమాజం):** టాలీవుడ్ ప్రముఖ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ కు ఈడీ శుక్రవారం నోటీసులు ఇచ్చింది. గతంలో రకుల్ ఈడీ విచారణకు హాజరైన విషయం తెలిసిందే. అత్యవసరంగా వెళ్లాల్సి ఉందని గతంలో విచారణ మధ్యలోనే రకుల్ వెళ్లిపోయింది. దీంతో మరోసారి విచారణకు హాజరుకావాలని రకుల్‌కు ఈడీ నోటీసులు జారీ చేసింది. గతేడాది సెప్టెంబర్ 3తేదీన రకుల్ ప్రీత్ ను ఈడీ అధికారులు విచారించారు. అయితే తాజాగా టాలీవుడ్ డ్రగ్స్ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. గతేడాది ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 22 వరకు ఈడీ పలువురిని ప్రశ్నించింది. ఎక్సైజ్ అధికారులు 2017 జులైలో ఎన్డీపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. సిట్ ఏర్పాటు చేసి పలువురు నటులు, దర్శకుడిని అధికారులు ప్రశ్నించారు. 2021 సెప్టెంబర్‌లో మనీలాండరింగ్ కింద టాలీవుడ్ డ్రగ్స్ కేసును ఈడీ దర్యాప్తు చేసి 12 మందికి నోటీసులు జారీ చేసింది. పూరి జగన్నాథ్, ఛార్మి, రవితేజ, రకుల్ ప్రీత్ సింగ్, దగ్గుపాటి రానా, ముమైత్ ఖాన్, నందు, తనీష్, తరుణ్, నవనీత్, పబ్ మేనేజర్, రవితేజ డ్రైవర్ శ్రీనివాసులను ఈడీ విచారించింది. మరోవైపు భారత్ రాష్ట్ర సమితి ఎంఎల్ఏ పైలట్ రోహిత్‌రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ నోటీసులు జారీ చేసింది. టాలీవుడ్ డ్రగ్స్ కేసులో వీళ్లిద్దరికీ నోటీసులిచ్చినట్లు తెలుస్తోంది. ఈనెల 19న విచారణకు హాజరుకావాలని అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. ఈడీ నోటీసులపై ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి స్పందించారు. ఈడీ నోటీసులు అందాయని తెలిపారు. తన వ్యాపారాలు, కంపెనీలకు సంబంధించిన వివరాలు అడిగారని చెప్పారు. 19న ఈడీ విచారణకు హాజరవుతానని చెప్పారు. 2021 ఫిబ్రవరిలో కర్ణాటక రాజధాని బెంగళూరులో పట్టుబడిన డ్రగ్స్‌తో పైలట్ రోహిత్ రెడ్డికి సంబంధాలు న్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు. భారీగా నగదు చేతులు మారిన నేపథ్యంలో కేసును ఈడీకి అప్పగించారు. ఈ నేపథ్యంలోనే రోహిత్ రెడ్డికి నోటీసులు అందినట్లు తెలుస్తోంది. డిసెంబర్ 19వ తేదీన ఈడీ ఆఫీస్ కు రావాలని చెప్పారని సూచించారు. ఆధార్, ఓటర్ ఐడితో సహా ఆర్థిక లావాదేవీల పత్రాలను తీసుకోని రమ్మన్నారని వెల్లడించారు. కేసు వివరాలు లేకుండా ఇచ్చిన నోటీసుల పై లీగల్ టీంతో పరిశీలిన చేస్తాని రోహిత్ స్పష్టం చేశారు. లీగల్ ఒపీనియన్ తీసుకున్న తరువాతే నోటీసులపై స్పందిస్తానని పైలెట్ రోహిత్ రెడ్డి పేర్కొన్నారు.

# ఊపిరితిత్తుల్లో నీరు చేరడం వల్లే బాలిక మృతి

## పోస్ట్‌మార్టమ్ ప్రాథమిక నివేదికలో వెల్లడి

## ఆందోళన మద్యే తల్లిదండ్రులకు బాడీ అప్పగింత

## కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆందోళన

**మేడ్చెల్, డిసెంబర్ 16 (సమసమాజం):** దమ్మాయిగూడలో బంధువులు, స్థానికుల ఆందోళన మధ్య చిన్నారి మృతదేహం ఇంటికి చేరుకుంది. బంధువులు, స్థానికులకు ఆందోళన మధ్య పోలీసులు డెడ్ బాడీని ఇంటికి తరలించారు. పోలీసులు భారీ బందోబస్తు మధ్య అంబులెన్సులో మృతదేహాన్ని ఇంటికి పంపారు. అయితే అంబులెన్సును చిన్నారి కుటుంబసభ్యులు, స్థానికులు, బీజేపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. పోస్టు మార్టం రిపోర్టులో ఏం జరిగిందో చెప్పడంతో పాటు బాలిక కుటుంబానికి న్యాయం చేసేంత వరకు అంబులెన్స్ ను కదలనిచ్చే ప్రసక్తేలేదని అన్నారు. చిన్నారి కడసారి చూపుల కోసం వేలాది మంది తరలివచ్చారు. చిన్నారిని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. స్థానిక నాయకులు సైతం బాలిక మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నిన్నటి వరకు ఆడుతూ పాడుతూ తిరిగిన కూతురు ఈ రోజు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. హృదయవిదారకంగా రోదిస్తున్న వారిని సముదాయించడం ఎవరి వల్లా కావడం లేదు. ఇదిలా ఉంటే బాలిక మృతిపై బంధువులు, స్థానికుల ఆందోళన కొనసాగుతోంది. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ వారు ఆందోళనకు దిగారు. పోలీస్ పెట్రోలింగ్ వాహనంపై రాళ్లతో దాడికి ప్రయత్నించారు. బాదిత కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేసారు.బాలిక మృతదేహానికి పోస్ట్ మార్టం ముగిసిన తరవాత బాడీని అప్పగించారు. డాక్టర్లు ఇచ్చిన ప్రాథమిక నివేదిక ప్రకారం బాలిక శరీరంపై ఎటువంటి గాయాలు లేవని తేల్చారు. చిన్నారి ఊపిరితిత్తుల్లో నీరు చేరినట్లు గుర్తించారు. చెరువులో పడి నీరు మింగడం వల్లే బాలిక చనిపోయినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే బాలికను ఎవరైనా చెరువులో తోసేశారా..?.. లేక తనే ఆడుకుంటూ చెరువులో పడిందా అనేది తేలాల్సి ఉంది. నిబంధనల మేరకు గాంధీ హాస్పిటల్ డాక్టర్ల బృందం పంచనామా, పోస్ట్ మార్టం పూర్తి చేసింది. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు బాలిక డెడ్ బాడీని పోలీసులు అప్పగించారు. బాలిక మృతి నేపథ్యంలో గాంధీ మార్చురీ వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. తెలంగాణ కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సునీత రావు ఆందోళన నిర్వహించారు. బాలిక మృతికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమని ఆమె ఆరోపించారు. దీంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆందోళన చేస్తున్న మరికొంత మంది మహిళా కార్యకర్తలను అరెస్టు చేశారు.

# ఘట్టుప్పల్‌లో ఏకమైన అఖిలపక్షం

## ఫార్మా కంపెనీ వద్దు



అసలే ఫ్లోరైడ్ బాధిత ప్రాంతం, అలాంటి ప్రాంతంలో ఫార్మా కంపెనీ నిర్మాణం చేపట్టడంపై గట్టుప్పల్ ప్రాంత ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం చేపడుతున్న ఫార్మా కంపెనీపై గతంలో ఉద్యమాలు చేపట్టిన ఫలంగా కొంత కాలం నిర్మాణాలు ఆగిపోయాయి. అనూహ్యంగా ఇటీవల జరిగిన మునుగోడు ఉపఎన్నిక తరువాత నిర్మాణాలు పునరావృతం అవ్వడం గమన్హరం. సదరు ఫార్మా కంపెనీ నిర్మాణాలపై గట్టుప్పల్ ప్రజా ప్రతినిధులు మంత్రి జగదీశ్వర్‌రెడ్డి దృష్టికి, కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. అయినా కూడా నిర్మాణాలు ఆగకపోవడంతో అఖిల పక్ష ధర్నాకు తావిచ్చింది.

**నల్లగొండ, డిసెంబర్ 16 (సమసమాజం):** గట్టుప్పల, పుట్టపక గ్రామాల మద్యలో నిర్మిస్తున్న కాంతి లేబరేటరిస్ ఫార్మా కంపెనీ అనుమతులు వెంటనే రద్దు చేయాలని శు క్రవారం అఖిల పక్షం ఆధ్వర్యంలో నిరసన ధర్మా నిర్వహించారు. ఈ సందర్భంగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి చలమల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గట్టుప్పల్ ప్రాంతం లో నిర్మిస్తున్న ఫార్మా కంపణీ అనుమతులను రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పాల్గొన్నారు. ఫార్మాకంపణీకి వ్యతి రేకంగా జరిగే పోరాటానికి గట్టుప్పల్ సర్పంచ్ ఇడం రోజ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.

# పార్లమెంట్‌లో జారిపడ్డ శశిథరూర్





**న్యూఢిల్లీ, డిసెంబర్ 16 (సమసమాజం):** కాంగ్రెస్ సీనియర్ లీడర్ శశిథరూర్ కాలికి గాయమైంది. పార్లమెంట్ మెట్లు దిగుతుండగా జారిపడ్డారు. దీంతో ఆయన ఎడమ కాలు బెణికింది. నొప్పి తీవ్రమై ఆసుపత్రికి వెళ్లారు. వైద్యుల సూచన మేరకు ప్రస్తుతం ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. నడవలేని పరిస్థితిలో ఉన్నందున తన నియోజకవర్గ పరిధిలో ఉన్న పనులను రద్దు చేసుకున్నట్లుగా శశిథరూర్ ట్విట్టర్ లో వెల్లడించారు. కాలికి కట్టు కట్టిన ఫొటోలను ట్వీట్ చేశారు. థరూర్ త్వరగా కోలుకోవాలని నెటిజన్లు ఆకాంక్షించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈనెల 7వ తేదీన ప్రారంభమయ్యాయి.

# తెలంగాణ బెబ్బులి షర్మిల

## ప్రజల కోసం పాటుపడితే అడ్డుకోవడమేంటి

## పాలేరులో పార్టీ కార్యాలయ శంకుస్థాపనలో విజయమ్మ



**ఖమ్మం, డిసెంబర్ 16 (సమసమాజం):** పాలేరు తెలంగాణను పాలించే ఊరు అవుతుందని వైఎస్ విజయమ్మ అన్నారు. ఖమ్మం జిల్లా అంటే షర్మిల నాయకత్వంలో త్వరలో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వానికి గుమ్మం అవుతుందని ఆకాంక్షించారు. పాలేరు ఇక నుంచి అభివృద్ధికి, సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్ అవుతుందని చెప్పారు. పాలేరులో వైటిపి తెలంగాణ పార్టీ మరో ముందడుగు వేసిందన్నారు. పార్టీ కార్యాలయ నిర్మాణానికి చేసిన భూమి పూజ తెలంగాణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు నాంది అని తెలిపారు. తెలంగాణలో వెనుబడిన వర్గాల బాగు కోసం, నిరాదరణకు గురైన వర్గాల బాగు కోసం తొలిమెట్టు అని వెల్లడించారు. ప్రజలకు మంచి చేయాలని, వారి జీవితాలు బాగు చేయాలని గొప్ప సంకల్పంతో షర్మిలమ్మ ముందుకెళ్తోందన్నారు. ఖమ్మం జిల్లా పాలేరులో వైఎస్సార్ తెలంగాణ పార్టీ కార్యాలయ నిర్మాణానికి వైఎస్ షర్మిలతో కలిసి వైఎస్ విజయమ్మ శంకుస్థాపన చేశారు. వైఎస్ షర్మిల తెలంగాణ బొబ్బిలి అని వైఎస్ విజయమ్మ అన్నారు. ప్రజల కోసం పాద యాత్ర చేస్తే తెలంగాణ ప్రభుత్వం షర్మిలను అడ్డుకునే ప్రయత్నం చేసిందని చెప్పారు. బస్సులు, వాహనాలు తగలబెట్టినా..మొక్కవోని దీక్షతో షర్మిల ముందుకెళ్తోందన్నారు. అరెస్టులు చేసినా...పోలీస్ స్టేషన్ లో గంటలు గంటలు నిర్బంధించినా సహనంతో భరించిందన్నారు. ప్రజలకు సేవ చేయాలనుకోవడం, ప్రజా సమస్యలపై పోరాడటం షర్మిల చేసిన తప్పా అని ప్రశ్నించారు. ఉద్యోగాలు ఇవ్వమని అడిగితే లాఠీ చార్జ్ చేశారని చెప్పారు. రైతులను కాపాడు దొరా అని అంటే అరెస్ట్ చేశారన్నారు. ప్రజల బాధలను తీర్చండని అడిగితే కొట్టి, తిట్టి, ఈడ్చుకెళ్లారున్నారు. ఎన్ని చేసినా వైఎస్ రక్తం దేనికి భయపడదన్నారు. ఎన్ని నిర్బంధాలు సృష్టించినా..అరెస్టులు చేసినా..ప్రజల నుంచి..తెలంగాణ నుంచి షర్మిలను వేరుచేయలేరన్నారు. షర్మిల నమ్మిన సంక్షేమం, సమన్యాయం, స్వయం సమృద్ధి ప్రజలకు అందిస్తుందని చెప్పారు.

## ప్రభుత్వాసుపత్రిలో కాన్పు చేసుకున్న జడ్జి

(మొదటి పేజి తరువాయి)సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. సర్కారు దవాఖానాల్లో పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వం కార్పొరేట్ తరహాలో మెరుగైన వైద్య సేవలు అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందుతుందనడానికి నిదర్శనం ఇదేనని అన్నారు. నార్మల్ డెలివరీలు చేయడానికి వైద్యులు కృషి చేయాలని మంత్రి వైద్యులను ఆదేశించారు.

## వందరోజులు పూర్తి చేసుకున్న జోడోయాత్ర

(మొదటి పేజి తరువాయి)పురస్కరించుకుని, కాంగ్రెస్ అధికారిక ట్విట్టర్ డీపీని '100 రోజుల యాత్ర'గా మార్చారు. కాగా, మీనా హైకోర్టు నుంచి ప్రారంభమయ్యే 100వ రోజు యాత్ర ఉదయం 11 గంటలకు గిరిరాజ్ ధరన్ ఆలయం వద్ద రాహుల్ కొన్ని గంటలు విరామం తీసుకుంటారు. యాత్ర 100 రోజులు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం రాత్రి 7 గంటలకు లైవ్ కాన్సర్ట్ తో రాష్ట్ర కాంగ్రెస్ కచేరీని ఏర్పాటు చేయనుంది. దీనికి రాహుల్ గాంధీ హాజరవుతారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు నిర్వహించ తలపెట్టిన 'భారత్ జోడో యాత్ర' సెప్టెంబర్ 7న కన్యాకుమారిలో ప్రారంభమైంది. ఇప్పటివరకు తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లను దాటుకొని రాజస్థాన్‌లోకి ప్రవేశించింది. రాజస్థాన్‌లో ప్రస్తుతం 12వ రోజు యాత్ర కొనసాగుతోంది. రాజస్థాన్‌ను కవర్ చేసిన తర్వాత ఈ నెల 21 న హర్యానాలోకి ఈ యాత్ర ప్రవేశిస్తుంది.

# కోర్టు ధిక్కరణ కేసుల్లో ఎపి టాప్

### లోక్‌సభలో న్యాయశాఖ మంత్రి వెల్లడి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 16 (సమసమాజం):** కోర్టు ధిక్కరణ కేసుల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. దేశంలో అధికంగా ఏపీలో 11,348 కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని లోక్‌సభ్లో కేంద్ర న్యాయశాఖ మంత్రి వెల్లడించారు. తెలంగాణ హైకోర్టులో 6,236 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని హైకోర్టుల్లో 16,42,371 రిట్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని న్యాయశాఖమంత్రి లిఖితపూర్వక సమాధానిచ్చారు. మరోవైపు కోర్టు ధిక్కరణ వ్యాజ్యాల సంఖ్య పెరగడంపై హైకోర్టు ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాదిలో నవంబర్ నెల వరకు 4 వేలకుపైగా ఈ కేసులు నమోదయ్యాయని న్యాయస్థానం పేర్కొంది. ఈ వ్యాజ్యాల సంఖ్య పెరగడంతో కోర్టుకు హాజరయ్యే ఉన్నతాధికారుల సంఖ్య కూడా పెరిగిందని పేర్కొంది.

# 26నుంచి రాష్ట్రపతి ముర్ము నగరంలో విడిది

(మొదటి పేజి తరువాయి)కుమార్ బీఆర్‌కేఆర్ భవన్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి విడిది కోసం ఏర్పాట్లకు సంబంధించిన విషయాలపై చర్చించారు. రాష్ట్రపతి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేయాలని, ఈ మేరకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. రాష్ట్రపతి మార్గంలో రోడ్డు మరమ్మతులు, బారికేడింగ్ పనులు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్, కంటోన్మెంట్ బోర్డు సీఈవోలను ఆదేశించారు. పోలీసు శాఖ విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేయాలని కోరారు. రాష్ట్రపతి నిలయంలో ప్రోటోకాల్ అనుసరించి 24 గంటల పాటు విద్యుత్తు శాఖ, వైద్య బృందాలను నియమించాలని సంబంధిత విభాగాలను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా కన్హాశాంతి వనంలో శ్రీ రామచంద్ర మిషన్ వ్యవస్థాపకులు రామచంద్ర మహారాజ్ 150వ జయంతి ఉత్సవాలను రాష్ట్రపతి ప్రారంభిస్తారని సోమేశ్ కుమార్ తెలిపారు. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జరిగే ఉత్సవాలు సజావుగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ఈ ఉత్సవాలకు దేశ, విదేశాల నుంచి నుంచి లక్ష మందికి పైగా యాత్రికులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, శాఖల అధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జాతీయ రాజకీయాల్లోకి బిఆర్ఎస్ ప్రవేశం

(మొదటి పేజి తరువాయి)

మారుతీసాగర్ తదితరులు అభినందనలు తెలిపారు. సీఎం కేసీఆర్‌ను కలిసిన ఏపీకి చెందిన లాడుగు గోవిందరావు. చిత్రంలో గొర్రెల, మేకల అభివృద్ధి సంస్థ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు తదితరులు ఢిల్లీలో సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేసారు. బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్,అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్,రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్,టీఎస్ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ తదితరులు కూడా ఢిల్లీలో సీఎం కేసీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు.



# ఉదయ్‌పూర్ డిక్లరేషన్ అమలు కావాలి

### కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్



**హైదరాబాద్, డిసెంబర్ 16 (సమసమాజం):** ఉదయపూర్ డిక్లరేషన్ ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలని అధిష్టానానికి తెలియజేశామని కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ తెలిపారు. రాజకీయ, పార్టీ పదవులు, రాజ్యాంగ పదవుల్లో న్యాయం చేయాలని కోరినట్లు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు కాంగ్రెస్ పార్టీకి దూరం కావడానికి గల కారణాలపై చర్చించామని తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు ఢిల్లీ పర్యటనకు వచ్చామని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ఆకాంక్షను కాంగ్రెస్ అధిష్టానానికి తెలియజేసేందుకు ఢిల్లీకి వచ్చామన్నారు. రాష్ట్రంలో రాజకీయ పదవుల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు సమస్యలు ఎదుర్కొంటున్నాయని, బీసీలకు రాజకీయ పదవులతో పాటు, వచ్చే ఎన్నికల్లో 50? సీట్లు కేటాయించాలని అడిగామని అద్దంకి దయాకర్ చెప్పారు. ధరణి వల్ల తెలంగాణలో దళితులు, గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గత ఎనిమిది సంవత్సరాల్లో టీఆర్ఎస్ పార్టీ ధన రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో అన్ని వర్గాలకు లాభం చేకూర్చింది కాంగ్రెస్ పార్టీనేనని, భారత్ జోడు యాత్ర సందేశాన్ని ప్రతి గల్లి గల్లికీ తీసుకెళ్తామన్నారు.

# విషాదంగా ముగిసిన పాప మిస్సింగ్

(మొదటి పేజి తరువాయి)చిన్నారి శవం నీటిపై తేలుతూ కనిపించింది. వెంటనే చెరువు నుంచి మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. రంగంలోకి దిగిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేయడంతో శుక్రవారం దమ్మాయిగూడ చెరువులో పాప మృతదేహం లభ్యమైంది. పాప మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించే క్రమంలో పోలీస్ వాహనానికి తల్లిదండ్రులు అడ్డుపడ్డారు. పోలీస్ వాహనం ఎక్కి వాహనాన్ని ముందుకు వెళ్లనీయకుండా కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో దమ్మాయిగూడ చెరువు వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. చిన్నారి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. చిన్నారి మృతిపై పోలీసులు అనుమానాస్పద మృతి క్రింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న చిన్నారి అకాల మరణంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. డెడ్ బాడీని చూసి సొమ్మసిల్లి పడిపోయారు. అయితే చిన్నారి మృతదేహాన్ని తల్లిదండ్రులకు చూపించకుండానే పోలీసులు ఆస్పత్రికి తరలించారు. కనీసం తమ కూతురు మృతదేహాన్ని చూపించలేదని తల్లిదండ్రులు కన్నీరు పెట్టుకుంటున్నారు. గురువారం ఉదయం 9 : 20 గంటల సమయంలో బాలికను తండ్రి స్కూల్ వద్ద డ్రాప్ చేశాడు. అనంతరం చిన్నారి పార్కుకు వెళ్దామని స్నేహితులతో చెప్పగా వారు నిరాకరించారు. దీంతో చిన్నారి క్లాస్ రూంలోనే బ్యాగు పెట్టి స్కూల్ నుంచి బయటకు వచ్చింది. ఉదయం 10.20 గంటలకు టీచర్ అటెండెన్స్ తీసుకోగా.. బాలిక మిస్సైనట్లు గుర్తించారు. బ్యాగు క్లాస్ రూంలోనే ఉండటంతో టీచర్లు స్కూల్ పరిసరాల్లో వెతికారు. ఆచూకీ దొరకకపోవడంతో చిన్నారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు జవహర్ నగర్ పోలీసులను ఆశ్రయించారు. బాలిక తప్పిపోయిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదుచేసుకున్న జవహర్ నగర్ పోలీసులు గాలింపు చేపట్టారు. స్కూల్ నుంచి బాలిక వెళ్లిన రూట్‌లో సీసీ టీవీ ఫుటేజ్ స్వాధీనం చేసుకున్నారు. బాలిక చెరువు వైపు వెళ్లినట్లు గుర్తించారు. బాలిక చదువుతున్న పాఠశాల నుంచి దమ్మాయిగూడ చెరువు కిలోమీటర్ దూరంలో ఉంది. చిన్నారి చెరువు వైపు ఎందుకు వెళ్లిందన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్కూలు నుంచి బయలు దేరిన బాలిక అసలు చెరువు వద్దకు ఎందుకు వెళ్లిందన్నది మిస్టరీగా మారింది. బాలిక శరీరంపై కత్తి గాయాలుండటంతో కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే పోలీసుల నిర్లక్ష్యం వల్లే పాప చనిపో యిందని చిన్నారి తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఫిర్యాదు చేసినా పోలీసులు సాయంత్రం వరకు మిస్సింగ్ కేసు నమోదుచేయలేదని అంటున్నారు. ఫిర్యాదు అందిన వెంటనే సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టుంటే చిన్నారి ఆచూకీ దొరికేదని తల్లిదండ్రులు అంటున్నారు.బాలిక మిస్సైన సమయంలో చెరువు వద్ద నలుగురు వ్యక్తులు గంజాయి తాగుతూ కనిపించారని బంధువులు చెబుతున్నారు. దానికి సంబంధించి సీసీ టీవీ ఫుటేజీని పోలీసులకు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉంటే దమ్మాయిగూడ చెరువు ప్రాంతం అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గంజాయి తాగడం నిత్యకృత్యంగా మారిందని అంటున్నారు. జవహర్ నగర్ పీఎస్‌లో ఈ విషయంపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

# ప్రధాని మోడీతో ఎంపి కోమటిరెడ్డి భేటీకోమటిరెడ్డి భేటీ

(మొదటి పేజి తరువాయి)మార్చాలని విన్నవించానని అన్నారు. మూసీ నదిలో డ్రైనేజీ, పారిశ్రామిక వ్యర్థాలు కలవడం వల్ల లక్షల మంది అనారోగ్యం పాలువుతున్నారని వెంకట్ రెడ్డి ప్రధాని దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. తన విన్నపంపై స్పందించిన మోడీ మూసీ ప్రక్షాళనపై త్వరలోనే ఓ కమిటీ వేస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. మూసీతో పాటు హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి విస్తరణ అంశాన్ని ప్రధాని ముందు ఉంచానని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రోడ్డు విస్తరణ చేయకపోవడం వల్ల యాక్సిడెంట్స్ జరుగుతున్నాయని చెప్పారు. జనగాం, భువనగిరి మధ్య ఎంఎంటీస్ ఏర్పాటు చేయాలని ప్రధానిని కోరానని, ఈ ప్రాజెక్టు వల్ల యాదాద్రికి వెళ్లే వారి సమస్య తీరుతుందని అన్నారు. ఈ అంశంపై త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ ను సైతం కలువనున్నట్లు వెంకట్ రెడ్డి ప్రకటించారు. తానిప్పుడు కేవలం ఎంపీని మాత్రమేనని, ఏ కమిటీలో లేనందున కాంగ్రెస్ పార్టీ గురించి అడగొద్దని వెంకట్ రెడ్డి అన్నారు. తాను స్టార్ క్యాంపెయినర్ ను కాదని చెప్పారు. ఎన్నికలకు నెల రోజుల ముందు మాత్రమే మాట్లాడతానన్న ఆయన.. రాజకీయాల్లో కొనసాగుతానా లేదా అన్న అంశంపై అప్పుడే స్పష్టత ఇస్తానని అన్నారు. అప్పటి పరిస్థితుల ఆధారంగా ఎంపీగా పోటీ చేయాలో ఎమ్మెల్యేగా బరిలో దిగాలో నిర్ణయం తీసుకుంటానని అన్నారు. రాష్ట్ర రాజకీయాల గురించి మోదీతో ఏమీ మాట్లాడలేదని అన్నారు. ఎన్నికలకు ముందు రాజకీయాల గురించి మాట్లాడతా. ఎంపీగా పోటీ చేస్తానా..? ఎమ్మెల్యేగా పోటీ చేస్తానా? అనేది త్వరలోనే చెబుతా. తెలంగాణలోని సమస్యలపై ప్రధాని మోదీతో మాట్లాడా. మూసీ ప్రక్షాళనపై, హైదరాబాద్-విజయవాడ 6 లైన్ల హైవేపై మాట్లాడా. హైవేను విస్తరించాలని ప్రధానిని కోరాను. ఎంఎంటీఎస్ ట్రైన్‌ను యాదాద్రి వరకు పొడిగించాలని కోరాను' అని కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. 'భువనగిరి కోటకు రోప్‌వే ఏర్పాటు చేయాలని కోరానని అన్నారు. ఎన్నికలకు నెల రోజుల ముందే రాజకీయాల గురించి మాట్లాడతా. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం, నల్లగొండ జిల్లా సమస్యలపై మోదీతో చర్చించా. గంగానది తరహాలో మూసీ నదిని కూడా ప్రక్షాళన చేయాలని ప్రధానిని కోరాను. ప్రస్తుతం నేను కాంగ్రెస్‌లోని ఏ కమిటీలో సభ్యుడిగా లేను' అని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.మూసీ ప్రక్షాళన కోసం అవసరమైతే సీఎం కేసీఆర్‌ను కలుస్తానని కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. కేసీఆర్‌ను ఎప్పుడూ విమర్శించే వెంకటరెడ్డి.. అవసరమైతే కలుస్తానంటూ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఢిల్లీలోనే వెంకటరెడ్డి ఉన్నారు. ఇటీవల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. కాంగ్రెస్‌లో యాక్టివ్‌గా ఉండాలని, జాతీయ స్థాయిలో కీలక పదవి ఇస్తామంటూ ఖర్గే హామీ ఇచ్చారు. అయినా కాంగ్రెస్‌లో వెంకటరెడ్డి యాక్టివ్‌గా కనిపించడం లేదు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తానంటూ వెంకటరెడ్డి ఖచ్చితంగా చెప్పలేకపోతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ నుంచి పోటీ చేస్తాననే విషయం ఎన్నికలకు నెల రోజుల ముందు మాత్రమే చెబుతానంటూ కోమటిరెడ్డ వెంకటరెడ్డి చెబుతున్నారు. దీంతో ఆయన ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారనేది అభిమానులు జోరుగా చర్చించుకుంటున్నారు. ఆయన సోదరుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీలో ఉండటం, గత కొంతకాలంగా వెంకటరెడ్డి కాంగ్రెస్‌కు దూరంగా ఉండటంతో.. ఆయన బీజేపీలో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. గతంలో పలుమార్లు ఆయన బీజేపీలో చేరుతారని ప్రచారం జరుగుతోండగా.. ఆ వార్తలను కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఖండిస్తూ వస్తోన్న విషయం తెలిసిందే. మొత్తానికి వెంకటరెడ్డి రాజకీయం రానున్న రోజుల్లో ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.



## కోమటిరెడ్డి ప్రధానితో భేటీపై ఎంపి అర్వింద్ ట్వీట్

(మొదటి పేజి తరువాయి)కాంగ్రెస్‌కు ప్రత్యర్థి పార్టీగా బీజేపీ ఉంది. దీంతో మోదీతో కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి భేటీ గురించి ధర్మపురి అర్వింద్ ట్వీట్ చేయడంతో.. ఇది కాస్త వైరల్‌గా మారింది. ఈ ట్వీట్‌పై నెటిజన్లు అనేక రకాలుగా స్పందిస్తున్నారు. కాంగ్రెస్ ఎంపీ భేటీ గురించి బీజేపీ ఎంపీ ట్వీట్ చేయడం ఏంటని, తమ్ముడు రాజగోపాల్ రెడ్డి బాటలో వెంకటరెడ్డి కూడా బీజేపీలో చేరుతారా? అంటూ నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు. కాంగ్రెస్ నేతలు టీఆర్ఎస్‌లోకి వెళ్లినప్పుడు ఇలాంటి పోస్టులు ఎందుకు పెట్టలేదని మరికొంతమంది ధర్మపురి అర్వింద్ ట్వీట్‌కు కామెంట్లు పెడుతున్నారు. కొంతమంది కాంగ్రెస్ ఫాలోవర్స్ స్పందిస్తూ.. మూసీ నది ఏమో కానీ.. ఇలాంటి వాళ్లను సస్పెండ్ చేసి కాంగ్రెస్‌ను శుద్ధి చేయాలంటూ వ్యాఖ్యానిస్తున్నారు. వెంకటరెడ్డి బీజేపీలో చేరికపై ధర్మపురి అర్వింద్ పరోక్షంగా ఈ పోస్ట్ ద్వారా సంకేతాలు ఇస్తున్నారని మరికొంతమంది నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి కాషాయ కండువా కప్పుకుంటారని ఎప్పటినుంచో ప్రచారం జరుగుతోంది. కానీ తనకు ప్రాణం ఉన్నంతకాలం కాంగ్రెస్‌లోనే ఉంటానని, అసరమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటాను తప్ప వేరే పార్టీలో చేరనంటూ గతంలో వెంకటరెడ్డి అనేకసార్లు క్లారిటీ ఇచ్చారు. కానీ రాజగోపాల్ రెడ్డి కాషాయ గూటికి చేరడంతో.. వెంకటరెడ్డి పార్టీ మార్పుపై అనేక అనుమానాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. మునుగోడు ఉపఎన్నికల సమయంలో కాంగ్రెస్ షోకాజ్ నోటీసులు జారీ చేసిన తర్వాత రాజకీయంగా వెంకటరెడ్డి సైలెంట్‌గా ఉంటున్నారు. వచ్చే ఎన్నికలకు నెల రోజుల ముందే ఏ పార్టీ నుంచి పోటీ చేస్తానో చెబుతానని ఇటీవల వెంకటరెడ్డి వ్యాఖ్యానించడంతో.. కాంగ్రెస్‌లో ఆయన కొనసాగుతారా? లేదా? అనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతోన్నాయి.

# హిమాచల్‌లో గెలిపించుకోలేని నేత నడ్డా

(మొదటి పేజి తరువాయి)విమర్శల్లో వాస్తవికత లేదని.. ఆయన మాట్లాడిన దాంట్లో రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే విషయం ఒక్కటి కూడా లేదన్నారు. ఇప్పటికైనా నడ్డాకు జ్ఞానోదయం కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మునుగోడులో ఫ్లోరోసిస్ రిసెర్చ్ సెంటర్ పెడ్తమన్నది.. ప్రత్యేక ఆస్పత్రి కట్టిస్తమన్నది.. ఇంకెప్పుడు కడ్తరు.. అక్కడి శిలాఫలకాలు మిమ్మల్ని వెక్కిరిస్తున్నయ్ అని ఆయన కామెంట్ చేశారు. తెలంగాణకు కేంద్రం నెలకో అవార్డు ఇస్తోంది.. ఢిల్లీలో అవార్డులు ఇస్తరు.. గల్లీలోనేమో తిడ్తరు అని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో డెలివరీలలో 66 శాతం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయి.. గతంలో ఇది కేవలం 30 శాతమే. వైద్యసేవలు రాష్ట్రంలో మెరుగుపడ్డాయి. కేరళ, మహారాష్ట్ర తర్వాత తెలంగాణ మూడో స్థానంలో ఉందని చెప్పారు. సెప్టెంబర్ 17ని అధికారికంగా నిర్వహించామన్న విషయం నడ్డా మరచిపోయారా అని ప్రశ్నించారు. స్వయంగా సీఎం కేసీఆరే ఆ కార్యక్రమంలో పాల్గొన్నరు. జేపీ నడ్డా అప్ డేట్ కావాలి. తెలంగాణలో ఏమేం జరుగుతోందో తెలుసుకోవాలని హరీశ్ రావు సూచించారు. తెలంగాణ ప్రభుత్వంపై నోరు పారేసుకున్న నడ్డాపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. నడ్డా.. ఇది పోరాటాల గడ్డ అని హరీశ్‌రావు హెచ్చరించారు. తిట్ల పురాణంతోనో, బట్ట కాల్చి మీదేయడం ద్వారానో, బురద జల్లడం ద్వారానో, కేసులు పెట్టడంతోనో, దాడులు చేయడం ద్వారానో తెలంగాణ ప్రజల మనసు గెలవలేరు. మీరు గెలవాలంటే.. గుజరాత్‌కు ఇచ్చినట్లు ప్యాకేజీలు ఇవ్వండి. ఎన్నికల ముందు గుజరాత్‌కు లక్షల కోట్ల ప్యాకేజీలు ఇచ్చినటువంటి ప్యాకేజీ ఇవ్వండి. అసలు హక్కుగా రావాల్సిన పైసలు ఇవ్వండని అంటూ డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకురూ. 24 వేల కోట్లు ఇవ్వమని నీతి ఆయోగ్ చెప్పింది. అవి ఇచ్చి తెలంగాణ ప్రజల మనసు గెలవండి. 15వ ఆర్థిక సంఘం తెలంగాణకు రూ. 5, 374 కోట్ల ఇవ్వాలని సిఫారసు చేసింది. అవి ఎప్పుడు ఇస్తారో చెప్పండి నడ్డా. ఈ దేశ చరిత్రలో ఆర్థిక సంఘం చెప్పింది చెప్పినట్లు అమలైంది. మరి ఒక్క తెలంగాణలో ఎందుకు అమలు కావడం లేదో చెప్పాలి. ఆర్థిక సంఘం నివేదికను గత ప్రభుత్వాలు తూచా తప్పకుండా అమలు చేశాయి. మరి తెలంగాణలో ఎందుకు అమలు కావడం లేదు. బీజేపీ నాయకులు సమాధానం చెప్పాలన్నారు.. తెలంగాణ పట్ల కుట్రపూరిత, పక్షపాత వైఖరి కాదా? తెలంగాణ ప్రజలను ఆర్థికంగా ఇబ్బంది పెట్టే కుట్ర కాదా? డబ్బులు ఇవ్వకుండా, పనులు జరగుతలేవు అని చెప్పడం కుట్ర కాదా? అని హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రూ. 15 వేల కోట్ల ఎఫ్‌ఆర్‌బీఎంలు ఆపి, బోరుబావుల కాడ మీటర్లు పెట్టలేదని రూ. 12 వేల కోట్లు, ఆర్థిక సంఘం చెప్పిన రూ. 5,374 కోట్లు ఆపి, నీతి ఆయోగ్ చెప్పిన రూ. 24 వేల కోట్లు ఇవ్వకుండా, రాష్ట్రానికి డబ్బులు ఇవ్వకుండా ఆపి, ఇంకోవైపు రాష్ట్రంలోకి వచ్చి అది అమలైతలేదు.. ఇది అమలైతలేదు అని చెప్పి జీతాలు లేటు వస్తున్నాయని మాట్లాడటం మీ కుట్ర కాదా? దీనికి సమాధానం ఏంటి? బీజేపీ నాయకులు సభ పెట్టుకుంటే అభ్యంతరం లేదు. ఈ రాష్ట్రానికి మీరు చేసిన మేలు ఏంటో చెప్పాలని హరీశ్‌రావు నడ్డాను డిమాండ్ చేశారు. అప్పుల గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ దేశాన్ని అప్పుల కుప్పగా మార్చింది బీజేపీనే. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు ఈ దేశంలో రూ. 56 వేల కోట్లు అప్పు ఉండే. ఇవాళ రూ. 1,35, 87, 893 కోట్లకు అప్పు చేరింది. 8 ఏండ్ల పాలనలో ఒక కోటి కోట్ల అప్పు చేసింద్రు. ఏడాదికి దాదాపు రూ. 12 లక్షల కోట్ల అప్పులు చేస్తున్నారు. నెలకు లక్ష కోట్ల అప్పు చేస్తున్నది బీజేపీ ప్రభుత్వం. మీరు అప్పుల గురించి మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉంది అని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ అద్భుతంగా పని చేస్తుంది. రాష్ట్రం ఏర్పడినప్పుడు తెలంగాణ జీఎస్‌డీపీ రూ. 4 లక్షల 51 వేల కోట్లు. ఈ ఎనిమిదేండ్లలో రూ. పదంకొండున్నర లక్షల కోట్లకు జీఎస్‌డీపీ చేరింది. ఇది మన పనితీరుకు గీటురాయి. రాష్ట్రం ఏర్పడ్డప్పుడు తెలంగాణ తలసరి ఆదాయం ఒక లక్ష 12 వేల 162 రూపాయాలు. గత సంవత్సరం తలసరి ఆదాయం 2 లక్షల 75 వేల 443 రూపాయాలు. తలసరి ఆదాయం రెట్టింపు అయింది. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు.. ఈ దేశ తలసరి ఆదాయం 79,118 రూపాయాలు ఉంటే మొన్న ఒక లక్ష 50 వేల 7 రూపాయాలు. అంటే దేశం కంటే మన పౌరుల తలసరి ఆదాయం ఒక లక్ష 25 వేల 436 రూపాయాలు అధికంగా ఉన్నది. ఇది మేం చెప్పే లెక్కలు కాదు.. కేంద్రం చెప్పిన లెక్కలు ఇవి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తలసరి ఆదాయం ఎందుకు పెరగలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు.






# చలన చిత్రం



## అవతార్-2..విజువల్ వండర్ అంటూ ప్రశంసలు

అవతార్ సీక్వెల్ మరో విజువల్ వండర్. అదో బ్లూ డ్రామా. జేమ్స్ కెమరూన్ కన్నా అద్భుతంగా సీక్వెల్స్ తీయగల ఘనుడు లేడన్నది వాస్తవం. ఏలియన్స్, టర్మినేటర్ 2, ఇప్పుడు అవతార్ .. ద వే ఆఫ్ వాటర్.. కెమరూన్ కళాఖండమే. 13 ఏళ్ల తర్వాత వచ్చిన అవతార్ 2 సీక్వెల్ ఓ స్టన్నింగ్ విజువల్ ట్రీట్. అంతకన్నా ఎక్కువగా ఇదో ఫ్యామిలీ డ్రామా. కుటుంబమే ముఖ్యం అనుకున్న జాక్ సల్లీ తన ఫ్యామిలీని ఎలా కాపాడుకున్నాడో సిల్వర్ స్క్రీన్‌పై చూడాల్సిందే. పండోర గ్రహంపై మళ్లీ క్వాట్రిచ్(విలన్) అటాక్ చేస్తాడు. జాక్‌నే పర్సనల్‌గా టార్గెట్ చేస్తాడు. ఆ దాడి నుంచి తన ఫ్యామిలీని కాపాడుకునేందుకు జాక్‌తో పాటు నేత్రీ ఓ సురక్షిత ప్రాంతానికి వెళ్తారు. జాక్ తన పిల్లల్ని ఎలా రక్షించుకున్నాడు.. ఎలా ఆ పిల్లలు తమ పేరెంట్స్‌ను కాపాడుకున్నారో .. ఆ కలర్‌ఫుల్ డ్రామాను కెమరూన్ ఆర్టిస్టిక్ ట్యాలెంట్‌తో చూడాల్సిందే.

ఇండియన్ మూవీగోయర్స్‌కు ఫ్యామిలీ డ్రామా కామనే. కానీ ఆ స్టోరీని చాలా డీసెంట్‌గా చెప్పాడు జేమ్స్. ఇక విజువల్ ఎఫెక్ట్స్ ఓ థ్రిల్. 3డీ వర్షన్‌లో ఆ థ్రిల్స్‌కు అంతే ఉండదు. కెమరూన్‌తో పాటు రిక్ జాఫా, అమండా సిల్వర్ ఈ ఫిల్మ్‌కు స్క్రిప్ట్‌ను అందించారు. భూ గ్రహం నుంచి పండోరాకు జాక్ కోసం వెళ్లిన క్వాట్రిచ్ భారీ విధ్వంసానికి పాల్పడుతాడు. జాక్ స్వంత పిల్లల్ని, దత్తత పిల్లల్ని బంధిస్తాడు. అయితే భూగ్రహ వాసుల నుంచి తప్పించుకున్న జాక్ ఫ్యామిలీ.. రక్షణ కోసం ఓ దీవుల సమూహానికి వెళ్తుంది. మెటకాయన్ల వద్ద జాక్ ఫ్యామిలీ ఆశ్రయం పొందుతుంది. ఆ సమయంలో ఆ సముద్ర దీవుల్లో ఉండే పాయకన్ అనే తిమింగలం లాంటి జలజంతువుతో జాక్ కుమారుడు లోవాక్ స్నేహం చేస్తాడు.




## డిఫరెంట్ రోల్‌లో వరలక్ష్మి శబరి చిత్రం

డిఫరెంట్ క్యారెక్టర్స్ చేస్తూ వరుస సక్సెస్‌లు అందుకుంటున్న వరలక్ష్మీ శరత్‌కుమార్.. 'శబరి' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు రెడీ అవుతోంది. అనిల్ కాట్జ్ దర్శకత్వంలో మహేంద్రనాథ్ కొండ్ల నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తిచేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ స్టార్ట్ చేశారు. గురువారం నుంచి వరలక్ష్మి డబ్బింగ్ చెప్పడం మొదలుపెట్టింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'శబరి పాత్ర పోషించినందుకు సంతోషంగా ఉంది. రీసెంట్‌గా షూటింగ్ పూర్తయింది. . ఇప్పుడు డబ్బింగ్ చెప్పడం స్టార్ట్ చేశా. నేను పని చేసిన బెస్ట్ ప్రొడ్యూసర్లలో మహేంద్ర ఒకరు. చాలా లొకేషన్లలో షూటింగ్ చేశాం. సినిమా బాగా వచ్చింది' అని చెప్పింది. ఇందులోని యాక్షన్ సీన్స్ హైలైట్‌గా నిలుస్తాయని, త్వరలోనే రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేస్తామన్నారు నిర్మాత. ఇక తెలుగులో బాలకృష్ణ చిత్రంతో పాటు 'హనుమాన్'లో నటిస్తోన్న వరలక్ష్మి.. తమిళ, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఫుల్ బిజీగా ఉంది.



## రష్మిక బాలీవుడ్ ఆశలపై నీళ్లు

### గుడ్‌బై ఫ్లాప్‌తో బాలీవుడ్ ఆశలు గల్లంతు

దక్షిణాది అగ్ర కథానాయికలలో రష్మిక ఒకరు. ఛలో సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ కన్నడ సోయగం.. అనతికాలంలోనే అగ్ర హీరోలతో జోడీ కట్టి స్టార్ హీరోయిన్‌గా పేరు సంపాదించుకుంది. ఇక గతేడాది రిలీజైన 'పుష్ప'తో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఈమె బాలీవుడ్‌లో గుర్తింపు కోసం గట్టి ప్రయత్నాలే చేస్తుంది. ఇటీవలే అమితాబ్‌తో కలిసి నటించిన 'గుడ్‌బై' సినిమా రిలీజై ఫ్లాప్‌గా మిగిలింది. దాంతో బాలీవుడ్‌లో గ్రాండ్ ఎంట్రీ ఇవ్వాలనుకున్న రష్మిక కల.. కలగానే మిగిలిపోయింది. ప్రస్తుతం ఈమె ఆశలన్నీ 'మిషన్ మజ్ను' చిత్రం పైనే ఉన్నాయి. సిద్దార్థ్ మల్హోత్రా హీరోగా నటించిన ఈ మూవీ స్పై యాక్షన్ జానర్‌లో తెరకెక్కింది. ఇప్పటికే రిలీజై ట్రైలర్ సినిమాపై విపరీతమైన అంచనాల నెలకొల్పాయి. నిజానికి రష్మిక ఈ సినిమాతోనే బాలీవుడ్ ఎంట్రీ ఎ÷-లాన్ చేసింది. కానీ కొన్ని కారణాలతో ఈ సినిమా పోస్ట్ పోన్ అవుతూ వచ్చింది. కాగా ఈ సినిమా నేరుగా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌లో వచ్చే ఏడాది జనవరి 20నుండి ఈ మూవీ స్ట్రీమింగ్ కానుంది. ఎన్నో వాయిదాల తర్వాత చివరకు ఈ సినిమాను ఓటీటీలో రిలీజ్ చేయాలని మేకర్స్ నిర్ణయించుకున్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది.

ఈ సినిమాలో రష్మిక అంధురాలి పాత్రలో నటించనున్నట్లు తెలుస్తుంది. సినిమాలో ఈమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉండనుందట. ఈ పాత్ర కోసం రష్మిక సినిమా ప్రారంభానికి ముందు చాలానే రీసెర్చ్ చేసింది. అయితే ఆ సినిమా థియేటర్‌లో రిలీజ్ కాకపోవడం రష్మికను కాస్త నిరాశపరిచిందట. అంతేకాకుండా గుడ్‌బై ఎ÷-లాప్ అవడంతో ఈ బ్యూటీ తన ఆశలన్నీ మిషన్ మజ్ను చిత్రంపైనే పెట్టుకుంది. ఇక ఇప్పుడు ఈ సినిమా నేరుగా ఓటీటీలోనే రిలీజ్ కావడం ఒకింత అసంతృప్తికరంగానే ఉందట. ప్రస్తుతం రష్మిక బాలీవుడ్‌లో 'యానిమల్' సినిమా చేస్తుంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రణ్‌బీర్ హీరోగా నటిస్తున్నాడు.




## శాసనభ విలువలు తెలిపే చిత్రం పొలిటికల్

జర్నలిస్ట్‌గా కెరీర్‌ను ప్రారంభించి ఆ తరువాత సినీ జర్నలిస్ట్‌గా, పీఆర్ఓగా, శాటిలైట్ కన్‌స్టలెంట్‌గా సినీ పరిశ్రమకు దగ్గరయ్యాడు రాఘవేంద్ర రెడ్డి. 'శాసన సభ' చిత్రంతో ఆయన రచయితగా పరిచయమవుతున్నాడు. ఇంద్రసేన, ఐశ్వర్య రాజ్ జంటగా వేణు మడికండి దర్శకత్వంలో సప్పాని బ్రదర్స్ నిర్మించిన ఈ పొలిటికల్ థ్రిల్లర్ ఈ రోజు ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ 'అసెంబ్లీ బ్యాక్ డ్రాప్ స్టోరీ కావడంతో 'శాసన సభ' టైటిల్ పెట్టాం. కథతో పాటు స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ కూడా నేనే రాశాను. రియల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా ఇది రాశా. శాసనసభ అంటే పవిత్రస్థలం. దాన్ని ఓ దేవాలయంగా భావించాలి. కానీ ఇప్పుడు శాసనసభ విలువలు మసకబారుతున్నాయి. ఆ వాల్యూను ఈ జనరేషన్‌కి చెప్పాలనే ఉద్దేశంతో, సామాన్య ఓటర్లను ఆలోచింపజేసేలా తీశాం. 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ మ్యూజిక్ హైలైట్‌గా నిలుస్తుంది. ఓటు విలువను చెప్పే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో రాజేంద్ర ప్రసాద్ కనిపిస్తారు. ఇక నా నెక్స్ట్ మూవీగా ఓ యాక్షన్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్‌కు కథను అందించాను. షూటింగ్ జరుగుతోంది' అని చెప్పారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in